క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నాలుగు,ఐదో తరగతి విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పరీక్షలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే వస్తువులు, ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై జరిగిన పోటీలో నాలుగు,ఐదు తరగతుల విద్యార్థులు ప్రతిభ చూపారు. అనంతరం హెచ్ఎం హరికృష్ణ మాట్లాడుతూ కాలుష్యం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కాలుష్య సమస్యను ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై అవగాహన కల్పించామన్నారు. వాటిని విద్యార్థులు ఏ మేర అర్థం చేసుకున్నారో తెలుసుకోవడానికి ఈ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు.

6న మహిళా దినోత్సవ వేడుకలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయిబాబా మందిరంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని మార్చి 6న ప్రత్యేక వేడుకలను నిర్వహించనున్నట్టు కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పరిసర కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు గీత సెల్-8913505385, జ్యోతి సెల్ 8341754896 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారు


1,110వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని, విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 1110వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ రాష్ట్ర నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని సోమవారం షీలానగర్లో బీవీకే స్కూల్లో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా టి.రుమారావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కోదండరాం, ప్రధాన కార్యదర్శిగా మోటూరు వెంకట సన్యాసినాయుడు, కార్యదర్శులుగా లోవరెడ్డి, బొజ్జ రమేష్, కోశాధికారిగా లాలం ప్రసాద్లు, ఉక్కు నట్టు జిల్లా కార్యదర్శులుగా శరగడం చంద్రరావు, రాబ్బం సురేష్, జోనల్ కార్యదర్శిగా రాందాస్ నరేంద్రలు తెలిపారు.

ప్రేమసమాజంలో లిఫ్ట్ ఏర్పాటు

దాబాగార్డెన్స్: దాబాగార్డెన్స్ ప్రేమసమాజం ప్రాంగణంలోని కంచర్ల అన్నపూర్ణాదేవి ఏసీ ఆడిటోరియంలోని ప్రేమసమాజం మాజీ అధ్యక్షుడు కంచర్ల రామబ్రహ్మం ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్ను సోమవారం ప్రారంభించారు. రామబ్రహ్మం మాట్లాడుతూ తన మాతృమూర్తి పేరిట నిర్మించిన ఆడిటోరియంలోలిఫ్ట్ ఏర్పాటు చేయడం తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

పండగలా గృహ ప్రవేశాలు


మాట్లాడుతున్న పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్


కార్యక్రమంలో పాల్గొన్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

- అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- మార్చి 2న సామూహిక గృహ ప్రవేశాలు
- పట్టు వస్త్రాలు, భోజనాల ఏర్పాటు
- వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాలు పండగ వాతావరణంలో చేసుకుందామని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు వైఎస్సార్సీపీ కార్యాలయంలో సోమవారం టిడ్కో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్కుమార్ మాట్లాడుతూ గృహ ప్రవేశాలు అట్టహాసంగా నిర్వహించడానికి సన్నాహాలు చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మౌలిక వసతులు కల్పించడమే ఉందన్నారు. విద్యుత్ కనెక్షన్లు, నీటి సౌకర్యం పనులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. పనులు 95 శాతం పూర్తయ్యాయని అన్నారు. మార్చి 2న మంచి రోజు కావడంతో సామూహిక గృహ ప్రవేశాలు చేసుకుందామన్నారు. ఆ రోజు టిడ్కో గృహాల వద్ద అన్ని ఏర్పాట్లు తన సొంత నిధులతో చేయనున్నట్టు ఆనంద్కుమార్ వెల్లడించారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించాలని సూచించారు. పూజ సామగ్రితో పాటు వచ్చే వారి అందరికీ భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గృహ ప్రవేశాలు చేసిన తర్వాత ఇళ్లల్లోకి పూర్తిగా రావడానికి సమయం ఉంటుందని ఈలోగా అన్న సౌకర్యాలు పూర్తవుతాయని తెలిపారు.

4, 600 మందికి ఇళ్లు

పద్మనాభనగర్, ములగాడ, అచ్చంనాయుడు లోవల్లో మొత్తంగా 4,600 ఇళ్లను ప్రారంభించే కార్యక్రమాన్ని పండగలా జరుపుకుందాని తెలిపారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ఇంత గొప్ప పని ఎవరూ చేయలేరని అన్నారు. గత ప్రభుత్వంలో డబ్బులు కట్టించుకుని ఓట్లు వేయకపోతే ఇల్లు రావని బ్లాక్మెయిల్ చేసిన నాయకుడు ఎమ్మెల్యే అయ్యాడని దుయ్యబట్టారు. ఆ తర్వాత నియోజకవర్గంలో ఎవరిని పట్టించుకోలేదని ఇంటికే పరిమితమయ్యారని విమర్శించారు. ఎన్నికల వస్తున్నాయని మళ్లీ బయటకు వచ్చి పని చేసే ప్రభుత్వంపై అసత్య విమర్శలు చేస్తున్నారని అన్నారు. పశ్చిమంలో మన బాగు కోరుకునే ఆడారి ఆనంద్కుమార్కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, కార్పొరేటర్ పీవీ సురేష్, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుజ్జరెడ్డి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, చుక్క ప్రసాదరెడ్డి, నమ్మి వెంకటకృష్ణమూర్తి యాదవ్, జియ్యాని మారుతి, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, వరలక్ష్మి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెట్టుబడుల ఉపసంహరణ యోచన విరమించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సింధియా: డిఫెన్స్ షిప్యార్డ్లను ప్రైవేటీకరించాలనే యోచనను ఉప సంహరించుకుంటున్నట్టు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్సింగ్ విశాఖ పర్యటనలో ప్రకటించాలని షిప్యార్డ్ సీఐటీయూ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. డిఫెన్స్ సెక్రటరీ గిరిధర్ సోమవారం మీడియా సమావేశంలో షిప్యార్డ్లో పెట్టుబడుల ఉపసంహరణకు ప్రభుత్వం పరిశీలిస్తుందని ప్రకటించారని.. ఇది భవిష్యత్తులో ప్రైవేటీకరణకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో షిప్ బిల్డింగ్ నిర్మాణ వ్యవస్థలో నంబర్ వన్గా ఉన్న దక్షిణకొరియాను దాటి చైనా దేశం నెంబర్గా ఎదిగిందంటే అక్కడ షిప్యార్డ్లు ప్రభుత్వ ఆధీనంలో ఉండడం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి షిప్యార్డ్ బలోపేతానికి నిధులు చేకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు బీఎస్ఎస్ రాజు, ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ల తనిఖీ


జ్ఞానాపురం పోలింగ్ బూత్లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రమణ

కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ జోన్-5 పరిధిలోని పోలింగ్ బూత్లను సోమవారం సాయంత్రం గోపాలపట్నం తహసీల్దార్ రమణ తనిఖీ చేశారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో సరైన గదులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. జ్ఞానాపురం బిషప్ మరియదాస్ కళ్యాణ మండపాన్ని తొలగించడంతో వాటిలో ఉండే సచివాలయాలు వేరే చోటుకు తరలించారని, దీంతో పోలింగ్ బూత్ ఏర్పాటుకు ఇబ్బంది కలిగిందని అన్నారు. ఉండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు త్వరగా చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆయన సూచించారు.

ఆనంద్కుమార్ పెద్దమనసు


ఆస్పత్రిలో కోలుకుంటున్న వలంటీర్ సత్యవతి

వలంటీర్కు సొంత నిధులతో ఆపరేషన్

గోపాలపట్నం: వైఎస్సార్సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ తన పెద్దమనసు చాటుకున్నారు. ఒక వలంటీర్ కుటుంబానికి అండగా నిలిచారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 91వ వార్డు గోపాలపట్నం 480 సచివాలయం పరిధిలో వలంటీర్గా పని చేస్తున్న జాగరపు సత్యవతి ఇటీవల తన ఇంటి వద్ద జారి పడడంతో హిప్ జాయింట్ దెబ్బతింది. దీంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం ప్రయత్నించగా రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. ఎలా ఈ గండం నుంచి గట్టెక్కాలని కుటుంబ సభ్యులు బాధలో మునిగి పోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆనంద్కుమార్ ఆ కుటుంబానికి ధైర్యాన్నిచ్చారు. శస్త్ర చికిత్స కోసం ఆందోళన పడవద్దని అంతా తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో తన సొంత ఖర్చులతో ఆపరేషన్ చేయించారు. ఇపుడు వలంటీర్ సత్యవతి కోలుకుంటోంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆనంద్కుమార్ తమ కుటుంబం ఆయనకు రుణ పడి ఉంటామని చెబుతున్నారు.

బుద్దిస్ట్ సొసైటీ కేంద్ర కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

సీతంపేట: ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(టీబీఎస్ఐ) 11వ బౌద్ధ సమ్మేళనం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్లో నూతన కేంద్ర కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ ట్రస్ట్ జాతీయ అధ్యక్షుడిగా చంద్ర బోధిపాటిల్, ప్రధాన కార్యదర్శిగా బి.కె.బరేవ్, కోశాధికారిగా శంకరరావు దొంగరేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గంలో మిగతా వారిని త్వరలో ఎన్నుకోనున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ కలలు గన్న ప్రబుద్ధ భారత నిర్మాణం కోసం కొత్త కమిటీ కృషి చేస్తుందని, బుద్ధుని సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ప్రతినిధులు తెలిపారు.

శ్రీవారికి పుష్పయాగం


ఊంజల్ సేవలో ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్నగర్లోని వెంకటాద్రిపై వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 19న పంచాహ్నికదీక్షతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు ఆధ్వర్యంలో ప్రతి రోజూ స్వామి వారికి ఆరాధన, నిత్య హోమాలు నిర్వహించారు. ఈ నెల 20న స్వామి వారి 18వ తిరు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ రోజు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. పుష్పయాగం, ఊంజల్సేవ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి సేవలో తరించారు.

28న మహిళలకు వంటలు, నడక పోటీలు

మద్దిలపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న మహిళలకు వంటలు, నడక పోటీలు నిర్వహిస్తున్నట్టు మహిళా వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్.అలివేలురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 51వ వార్డులోని ఈస్ట్ పాయింట్ యాజమాన్యం సహకారంతో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి మహిళలకు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోషకాహార పదార్థాలు తయారు చేయవచ్చని, మహిళల ఆరోగ్యం దృష్ట్యా వయసు వారీగా అందరికీ నడక పోటీలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా ప్రాంతాల్లో ఉండే ఆసక్తిగల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువతతోనే భారత్ అభివృద్ధి సాధ్యం


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎంపీ జీవీఎల్, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో యువత పాత్ర కీలకమని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం టి.ఎల్.ఎన్ సభా మందిరంలో నిర్వహించిన యువ సంవాద్ సమావేశం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజేతలు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. దేశ ప్రథమం అనే విధంగా యువత నడుచుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ నాక్ గ్రేడింగ్లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించడంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు, సేవలు ఉపయోగపడ్డాయన్నారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ యువత దేశం కోసం కలలు కనాలని, వాటిని సాకారం చేసే దిశగా పనిచేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ సూచించిన పంచ్ప్రాణ్ సూత్రాలను అంతా పాటిస్తే విక్షిత్ భారత్ను త్వరలో సాధిస్తామని చెప్పారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరుల బాధ్యతలను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వర్సిటీ స్థాయిలో పంచ్ ప్రాణ్పై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 30 మంది యువతీ యువకులు పాల్గొని తమ భావాలను ఆలోచనలను పంచుకున్నారు. వక్తృత్వ పోటీకి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఐ.పి.ఎస్ భాగ్యలక్ష్మి, వై.అనసూయ దేవి లను సత్కరించారు.

విద్యతోనే జీవితానికి వెలుగు


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

బీచ్రోడ్డు: విద్యతోనే జీవితానికి వెలుగు అంటూ కృష్ణా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం సోమవారం రెల్లి వీధిలో జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోషల్ సర్వే నిర్వహించారు. అందరూ చదువుకోవాలని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు.

ఈఎన్టీ ఆస్పత్రిలో నూతన పరికరాలు ప్రారంభం


పరికరాలను ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ ఆచార్య బుచ్చిరాజు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు(ఈఎన్టీ) ఆస్పత్రిలో పీజీ విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే ఉపకరణాలను అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బుచ్చిరాజు సోమవారం ప్రారంభించారు. చెవి ఎముక (టెంపోరల్) బోన్ చికిత్స విధానం చేయడంపై శిక్షణ అందించే విధంగా ఈ ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. రెండు మైక్రోస్కోప్లు, వీడియో స్క్రీన్లతో ప్రత్యక్షంగా వీక్షించే విధంగా అందుబాటులో ఉంచారు. చెవికి సంబంధించిన శస్త్ర చికిత్సలు చేయడానికి, నిపుణులుగా పీజీ విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ ప్రయోగాలు ఉపయుక్తంగా నిలుస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆస్పత్రి వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఆడారి ఆనంద్కుమార్


ఉత్తమ వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఆనంద్కుమార్, కార్పొరేటర్ వాణి

'పశ్చిమ' సమన్వయకర్త ఆనంద్కుమార్

కంచరపాలెం: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని వైఎస్సార్సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్కుమార్ చెప్పారు. జీవీఎంసీ 57వ వార్డు అయ్యప్పనగర్లోని రాజీవ్ గృహకల్ప నివాస సముదాయంలో రూ. 29లక్షలతో నిర్మించిన మంచినీటి పైపులైను సోమవారం ఆనంద్కుమార్ ప్రారంభించారు. అనంతరం 91 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్కుమార్ మాట్లాడుతూ ప్రజలు మంచినీటి కష్టాలు పడకుండా ఉండాలనే లక్ష్యంతో మంచినీటి పైపులైన్లు నిర్మించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానని ఆయన అన్నారు. ముందుగా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు, ఇన్చార్జి శ్రీనివాసరావు, 52,56,57 వార్డుల క్లస్టర్ ఇన్చార్జి పల్లా ఎర్రికుమార్, శ్యామ్కుమార్రెడ్డి, సచివాలయ కన్వీనర్లు రాము, దూళవరం, బుజ్జమ్మ, నీలవేణి, ఎర్రన్న, చిన్నం నాయుడు, బోగేశ్వర్, రాజు యాదవ్, సుధాకర్, సుధాకర్, సూర్యనారాయణ, ఆర్బీలు మంగ, నాగమణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సీఎం జగన్తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న పద్మారావు

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్సీపీ నగర కార్యదర్శి పద్మారావు అన్నారు. 60వ వార్డు అశోక్నగర్ ప్రాంతంలో సోమవారం స్థానిక మహిళల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి జగన్మోహన్రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి గుండెల్లో గుడి కట్టుకున్నారన్నారు. ఇది ఓర్వలేక ఇతర పార్టీల వారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. వారి మోసపూరిత మాటలు నమ్మితే ప్రస్తుతం వస్తున్న సంక్షేమ పథకాలకు బ్రేక్ పడతాయన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్న జగన్మోహన్రెడ్డి వచ్చే ఎన్నికల్లో మహిళలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్నగర్ ప్రాంత మహిళలు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 4 వినతులు


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 04 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, యూసీడీ 01, రెవెన్యూకు 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1, 2 టి.ఎస్.ఎన్.రాజు, ఆర్.వి.రావు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏఎంహెచ్వో డాక్టర్ ఎ.సునీల్కుమార్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, ఏడీలు పద్మావతి, ఈఈ వాటర్ సప్లై సూపరింటెండెంట్ శేఖర్ పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు


ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి


కార్యాలయానికి సైకిల్పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు అందరి సహకారం అవసరమన్నారు. ఈ రోజు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరూ ప్రజా రవాణాను వినియోగిస్తున్నామని తెలిపారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలి

అనకాపల్లి ఎస్పీ కె.వి. మురళీకృష్ణ


డాగ్ స్క్వాడ్ శిక్షకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: రానున్న ఎన్నికల్లో పోలీసులు దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలని అనకాపల్లి ఎస్పీ కె.వి. మురళీకృష్ణ సూచించారు. విశాఖ సిటీ నగర ఏఆర్ పోలీస్ మైదానంలో సోమవారం జరిగిన మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు కవాతుతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణతో పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు కృషి చేయాలన్నారు. చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇటీవల విజయవాడలో జరిగిన 32వ ఆర్టీ కోర్సులో మత్తు పదార్థాలను గుర్తించడంలో మొదటి బహుమతి పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ విభాగానికి చెందిన రాణీ(జాగిలం), పేలుడు పదార్థాలను గుర్తించి రెండో స్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లాకు చెందిన పోల్గా(జాగిలం) శిక్షకులను అభినందించారు. ఏఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ, ఎం.సత్తిబాబు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు నవీన్, అరవింద్, కిశోర్ పాల్గొన్నారు.